శుభప్రదం.. వరలక్ష్మీ వ్రతం

మాసాలన్నింటిలోనూ మంగళప్రదమైనది శ్రావణమాసం. ఈ మాసంలో శ్రావణలక్ష్మి సర్వాభరణాల అలంకరణలో తేజోవంతంగా భక్తులకు సాక్షాత్కరిస్తుంది. ముత్తైదువుల మనోభావాలకు, సంపద, సౌభాగ్యాలకు ఈ మాసం మహోదయం. అత్తవారిళ్లలో కొత్త కోడళ్ల కొంగొత్త ఆశలకు ఈ మాసం అశాజనకం. ఆషాఢం అడ్డంకులు అధిగమించాక కొత్త దంపతుల ఆనందప్రదమైన జీవితాలకు చంద్రోదయం.

- 25న శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు
- కళకళలాడుతున్న మార్కెట్లు




కళకళలాడుతున్న కంచరపాలెం మార్కెట్, పూజలందుకుంటున్న వరలక్ష్మి

కంచరపాలెం : మహిళలకు శుభప్రదమైన శ్రావణ మాసంలో మంగళ, శుక్రవారాల్లో ముత్తైదువులు ఇళ్లను పసుపు, కుంకుమలతో అలంకరిస్తారు. శ్రావణమాసానికి పదిహేను రోజుల ముందు నుంచే వస్త్ర దుకాణాలు, బంగారం షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడతాయి.

నూతన వస్తువులు, వస్త్రాలతో సందడి..

వివాహితలు విధిగా వారి స్తోమతను బట్టి కొత్త చీరలు కొని, శ్రావణ లక్ష్మికి చూపించి కట్టుకుంటారు. బంగారం ధర చుక్కల్ని తాకుతున్నా కొని శ్రావణలక్ష్మికి చూపించి ధరించడం అనాదిగా వస్తున్న ఆచారం. శ్రావణమాసం సందర్భంగా కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో వస్త్ర, బంగారు దుకాణాలు మహిళలతో కళకళలాడుతున్నాయి.

మంగళగౌరీ వ్రతాలు..

ఈ మాసంలో దేవాలయాలు, అమ్మవారి ఆలయాలు మహిళా భక్తులతో కళకళలాడుతుంటాయి. నిత్యం విశేష పూజలతోనూ, కుంకుమార్చనలతోనూ విరాజిల్లుతాయి. ప్రధానంగా కంచరపాలెం, తాటిచెట్లపాలెం, ఊర్వశి కూడలి, మర్రిపాలెం, మురళీనగర్, మాధవధార, అక్కయ్యపాలెం, సీతంపేట, సీతమ్మధార, జ్ఞానాపురం, ఎన్‌ఏడీ కొత్తరోడ్డు తదితర ప్రాంతాల్లో మంగళ, శుక్రవారాలు అమ్మవారికి మంగళగౌరీ వ్రతాలు, అభిషేకాలు, కుంకుమార్చనలు జరుగుతాయి.

పిండి వంటల ఘుమఘుమలు..

ఈ మాసంలో ప్రతి ఇంట మంగళ, శుక్రవారాల్లో పిండి వంటల ఘుమఘుమలు నోరూరిస్తాయి. ఆర్థిక ఇబ్బందులు ఎలా ఉన్నా అనాదిగా వస్తున్న ఆచారాన్ని అంతా తప్పక పాటిస్తారు. ఇరుగు పొరుగు వారికి పంచుకుని సంప్రదాయాన్ని చాటుకుంటారు.

ధరలు పెరిగినా పూజలు తప్పవు



సంప్రదాయానికి చిహ్నంగా జరుపుకునే పండగల్లో వరలక్ష్మి వత్రం ఒకటి. ధరలు ఆకాశాన్ని అంటుతున్నా పండగలు చేసుకోవడం తప్పదు. మార్కెట్‌లో ఏ వస్తువు కొనాలన్నా విపరీతంగా రేట్లు పెంచి విక్రయిస్తున్నారు. దుస్తులు, లక్ష్మీ కాసులు అన్నింటి ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయి.

– ఉప్పాల కల్యాణి , ఐటీఐ జంక్షన్

సాంప్రదాయం ఉట్టిపడుతోంది



వరలక్ష్మి వ్రతం అంటేనే మహిళల పండగ. సాంప్రదాయం ఉట్టిపడే ఈ పండగ రోజుల్లో ప్రతి ఇల్లు ఒక దేవాలయంలా మెరిసిపోతుంది. మంగళ, శుక్రవారాల్లో మంగళగౌరీ వత్రాలతో ఆధ్యాత్మికత ఉట్టి పడుతోంది.

– కె.లతశ్రీ, కంచరపాలెం

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామికి షష్టి పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్ కూడలి రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి ఏకాంత ఆలయంలో శ్రావణ మాస శుద్ధ షష్టి మంగళవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామికి స్కంద పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

వృద్ధురాలి అప్పగింత



వృద్ధురాలిని గోల్డేజ్ హోం ప్రతినిధికి అప్పగిస్తున్న పోలీస్

సీతమ్మధార : ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి శ్రీనగర్‌లోని గోల్డేజ్ రిటైర్మెంట్ హోమ్స్ నుంచి ఒక వృద్ధురాలు ఎవరికీ తెలియకుండా బయటికి రావడంతో స్థానికులు ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్‌కు తెలియజేశారు. భీమిలికి చెందిన వృద్ధురాలు ఐదు నెలలుగా ఈ హోంలో ఉంటున్నారు. మంగళవారం వృద్ధురాలు భీమిలి వెళ్లేందుకు రామా టాకీస్ వద్దకు ఆటో కోసం రావడంతో అనుమానం వచ్చిన స్థానికులు ఫోర్తుటౌన్ పోలీసులకు తెలిపారు. వెంటనే పోలీసులు వచ్చి గోల్డేజ్ హోం నిర్వాహకులకు వృద్ధురాలిని అప్పగించారు. నిర్వాహకులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన



నరసింహనగర్ రైతుబజార్‌లో ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

సీతంపేట: స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 ప్రచారంలో భాగంగా భద్రం ఫౌండేషన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కళాకారులు మంగళవారం నరసింహనగర్ రైతుబజార్‌లో 'ప్లాస్టిక్‌తో ప్రమాదం' అనే వీధి నాటిక ప్రదర్శించారు. పాలిథిన్ బ్యాగుల వినియోగం, ప్లాస్టిక్ వల్ల కలిగే ముప్పును వివరించారు. కార్యక్రమంలో బజారు ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నానాజి పాల్గొన్నారు.

ఎకో ఫ్రెండ్లీ రాఖీల తయారీలో శిక్షణ



రాఖీలు తయారు చేస్తున్న దివ్యాంగ చిన్నారులు

సీతంపేట: జేసీఐ జూనియర్ పరాక్రమ్ గ్రూప్ సభ్యుల ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం ప్రజ్వల్ వాణి వెల్ఫేర్ సొసైటీలో దివ్యాంగ పిల్లలకు రాఖీల తయారీలో శిక్షణ ఇచ్చారు. ప్లాస్టిక్ ఉపయోగించకుండా ఎకో ఫ్రెండ్లీ రాఖీలు ఎలా తయారు చేయాలో నేర్పించారు. ఊలు, ముత్యాలు ఉపయోగించి రాఖీలు తయారు చేసి జేసీఐ సభ్యులకు కట్టారు. ఈనెల 29, 30, 31 తేదీల్లో దివ్యాంగ పిల్లలు తయారు చేసిన ఎకో ఫ్రెండ్లీ రాఖీలు ప్రదర్శన, విక్రయం జరుగుతుందని సొసైటీ అధ్యక్షురాలు సుచిత్రారావు తెలిపారు. కార్యక్రమంలో జేసీఐ ప్రతినిధులు మాధవీలత, వంశీ, రాము, మురళీకృష్ణ పాల్గొన్నారు.

27న గాజువాకలో చేనేత కులస్తుల బహిరంగ సభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బందారు ఆనంద్ ప్రసాద్

సీతంపేట: ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ విశాఖశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన గాజువాక బీసీ రోడ్‌లోని టి.ఎస్.ఆర్.కల్యాణ మండపంలో చేనేత కులస్తుల బహిరంగ సభ జరగనుందని ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బందారు ఆనంద్ ప్రసాద్ అన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లు మంగళవారం శంకరమఠం రోడ్‌లోని పద్మశాలి భవనంలో ఫెడరేషన్ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 40 లక్షల చేనేతలు ఉన్నా రాజకీయంగా తగిన గుర్తింపు లభించడం లేదన్నారు. చేనేతల ఉనికిని చాటుకోవడంతో పాటు, సమస్యల పరిష్కారం కోసం 27వ తేదీన గాజువాకలో జరగనున్న చేనేతల బహిరంగ సభకు నేతన్నలంతా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సమతం రమణ మహేష్, రాష్ట్ర అధ్యక్షుడు ఎనమల శివరాంప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు, ఏపీ పద్మశాలి సంఘం పెద్దల కమిటీ చైర్మన్ తెడ్లాపు వెంకటేశ్వర్లు, ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి నాగేశ్వరరావు, జిల్లా నాయకులు మాడెం సూరిఅప్పారావు, కొప్పుల రామ్‌కుమార్, గుదే వేణు, పద్మశాలి భవనం అధ్యక్షుడు కులపాక సన్యాసిరావు, మాజీ కార్పొరేటర్ ఆలేటి హేమలత పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



షేక్ సయ్యుం

మర్రిపాలెం: కంచరపాలెం ఐదోపట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా..ఓల్డ్ ఐటీఐ దరి గజపతినగర్‌కు చెందిన షేక్ సయ్యుం రెండు నెలల నుంచి కనిపించడం లేదని అతని భార్య షేక్ ఫరీనా బేగం పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు.వీరిద్దరికీ 2006లో వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే సదరు వ్యక్తికి మద్యం సేవించే అలవాటు ఉండడంతో తరచూ గొడవలు పడి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి వచ్చేసేవాడు.అయితే ఈ సారి రెండు నెలలు అయినా భర్త ఇంటికి రాకపోవడంతో ఆమె ఫిర్యాదు చేశారు.సీఐ ఎస్. సాయి నేతృత్వంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అలరించిన 'భారత ప్రశస్థి' పద్య రూపకం



పద్యరూపకాన్ని ప్రదర్శిస్తున్న సాహితీవేత్తలు

సీతంపేట: శ్రీలలితాపీఠం ఆధ్వర్యంలో విశాఖ సాహితి సహకారంతో పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహా స్వామి సమక్షంలో నన్నయ మహాభారత రచన సహస్రాబ్ది ఉత్సవాల్లో భాగంగా భారత ప్రశస్థి అనే పద్య రూపకాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాజరాజ నరేంద్రుడిగా డాక్టర్ పేరి రవికుమార్(విశాఖ), నన్నయగా డాక్టర్ కడిమెళ్ల వరప్రసాద్ (నరసాపురం), తిక్కనగా శ్రీకోట వెంకటలక్ష్మీ నరసింహం (తణుకు), ఎర్రనగా తాత సత్యసందీప్ శర్మ(విశాఖ), నారాయణభట్టుగా ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణ (హైదరాబాద్) నన్నయ భారత రచన ప్రస్థానాన్ని అలాగే రాజరాజ నరేంద్రుడి ప్రోత్సాహాన్ని పద్యరూపకంలో కడు రమ్యంగా ప్రదర్శించారు. కార్యక్రమానికి సభాధ్యక్షులుగా విశాఖసాహితి అధ్యక్షులు ఆచార్య కోలవెన్ను మలయవాసిని వ్యవహరించారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని, విశాఖ సాహితి కార్యదర్శి శంకర్ నీలు భాగవతుల, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

40వ రోజుకు ఎన్‌ఎంయూ నిరాహార దీక్షలు



స్టీల్ సిటీ డిపోలో దీక్షలో పాల్గొన్న కార్మికులు

ఉక్కునగరం: ఆర్టీసీ కూర్మన్నపాలెం స్టీల్‌సిటీ డిపోలో ఎన్‌ఎంయూ కార్మికుల ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 40వ రోజుకు చేరుకున్నాయి. డిపో ఆవరణలోని యూనియన్ కార్యాలయంలో జరుగుతున్న దీక్షను డిపో కార్యదర్శి జి. సాయిరామ్, జోనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.ఎస్.ఎన్.ఎం.రాజు, డిపో కోశాధికారి డి.ఎస్. వాసు, మూర్తి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సిక్‌లకు జీతాలు ఇవ్వాలని, గ్యారేజి, ట్రాఫిక్ వల్ల గంటల తరబడి లేటు అయిన సందర్భంగా ట్రిప్పు కేన్సిల్ చేయాలని, కార్మికులకు రావాల్సిన ఓటీ డబ్బులు, పే ఎరియర్స్ నగదు చెల్లించాలని డిమాండ్ చేశారు.

సింహగిరిపై ఘనంగా నృసింహ హోమం



నృసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: స్వాతి నక్షత్రం పురస్కరించుకుని సింహగిరిపై మంగళవారం శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం వరాహ లక్ష్మీ నృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజున సింహగిరిపై నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఉదయం7గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో నృసింహ హోమం నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకొచ్చి అక్కడ ఉన్న హోమగుండం వద్ద అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు. అనంతరం నృసింహ హోమం విశేషంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ చేశారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని అర్చకుడు శ్రీకాంతాచార్యులు తలపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. తదుపరి ఆ జలాలను భక్తులపై చల్లారు. దేవస్థానం తరఫున ఉభయాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. దేవస్థానం అర్చకుడు పవన్‌కుమార్, వేదపండితులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈవో భ్రమరాంబ, సూపరింటిండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అప్పన్నకు విశేషంగా నిత్య కల్యాణం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న సీఐ రాము

పెదగంట్యాడ: ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని న్యూపోర్టు పోలీస్ స్టేషన్ సీఐ సువ్వారి రాము అన్నారు. అహింస పిరమిడ్ ధ్యానకేంద్రం 13వ వార్షికోత్సవం సందర్భంగా నెల్లిముక్కులోని జీవీఎంసీ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస పెట్టడమేనన్నారు. మనిషికి ఓర్పు, సహనం రావాలంటే విధిగా ధ్యానం చేయాలని సూచించారు. ఏ విషయంలోనూ తొందరపాటు పనికిరాదన్నారు. మనసును అదుపులో పెట్టుకుంటే ఎటువంటి సమస్యలు ఉండవని, అలాగే చెడు ఆలోచనలు రావని వివరించారు. అనంతరం సీఐ రామును, 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయ్‌ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఐ మన్మథరావు, ట్రస్ట్ ప్రతినిధులు శివ నాగేశ్వరరావు, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పెద్దపీట

- మేయర్ హరివెంకటకుమారి
- 43వ వార్డులో రూ.1.23 కోట్లతో అభివృద్ధి పనులు



శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సీతంపేట: నగరంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని మేయర్ హరివెంకటకుమారి అన్నారు. జీవీఎంసీ 43వ వార్డులోని శ్రీనివాసనగర్, నందగిరినగర్, చెక్కుడురాయి బిల్డింగ్ ప్రాంతాల్లో రూ.1.23 కోట్లతో బీటీ రోడ్లు నిర్మించనున్నారు. వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో 80 అడుగుల రోడ్ ఆర్చి వద్ద మంగళవారం పనులకు నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె.రాజు కొబ్బరికాయకొట్టి శంకుస్థాపన చేసారు. మేయర్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారన్నారు. జీవీఎంసీ పరిధిలోని ప్రతి వార్డులో రూ. 2 నుంచి 3 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. సమన్వయకర్త కె.కె.రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.185 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మరో రూ.35 కోట్ల వ్యయంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జీవీఎంసీ ఎస్ఈ వేణుగోపాల్, ఈఈ శ్రీనివాస్, డీఈ భరణి, ఏఈ రవణమ్మ , పార్టీ నాయకులు పైడి రమణ, తిరుపతిరావు, వల్లి, భైర వెంకట్, రమణారెడ్డి, మహాదాస్య గోపి, ఎం.సునీల్, ఎస్.కుమార్, నేపాల్ శ్రీను, ఖాదర్, రాణి, రమ, గ్రామ పెద్దలు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమంలో దూసుకుపోతున్న సీఎం జగన్ సర్కార్



టీపీటీ కాలనీలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న కె.కె. రాజు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు గాంధీనగర్–2 సచివాలయం పరిధిలోని టీపీటీ కాలనీలో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డితో కలిసి వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె. రాజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మహిళలు హారతులు పట్టి కె.కె. రాజు, ఇతర నాయకులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను కె.కె. రాజు ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి వివక్ష లేకుండా సీఎం జగన్ మోహన్‌రెడ్డి అందరికీ పథకాలు అందజేస్తున్నారని అన్నారు. ప్రజల ఆశీస్సులతో జగనన్న ప్రభుత్వం సంక్షేమం దిశగా దూసుకుపోతుందని తెలిపారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని అన్నారు. గత నేతలు సంక్షేమం కంటే స్వార్థ ప్రయోజనాల కోసమే పని చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాక్సర్ రాజు, సీనియర్ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన మురుగు



బాలయ్యశాస్త్రిలేఅవుట్ రోడ్డులో పొంగుతున్న మ్యాన్‌హోల్

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డులోని బాలయ్య శాస్త్రిలేఅవుట్ రోడ్డులో మ్యాన్‌హోల్స్ పొంగి మురుగునీరు రోడ్డుపై పారడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఆ మార్గంలో ముక్కు మూసుకుని వెళ్లే పరిస్థితి నెలకొంది. ఎప్పటికప్పుడు ఈ పరిస్థితి తలెత్తుతున్నా యూజీడీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండు రోజులుగా రోడ్డుపై మురుగు పారుతున్నా పట్టించుకునే నాధుడే లేడని వాపోతున్నారు. మూడు మ్యాన్‌హోల్స్ నుంచి మురుగునీరు బయటకు రావడంతో ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వరకు ప్రవహిస్తుంది. జీవీఎంసీ యూజీడీ విభాగం అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు మధ్యలో బండరాళ్లతో ఇక్కట్లు



ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక రోడ్డులోని బండరాళ్లు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డులోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక రోడ్డులో రహదారి మధ్యలో బండరాళ్లు వేయడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. నెల రోజులుగా బండరాళ్లు రోడ్డు మధ్యలో ఇదే తీరున పడి ఉండటంతో స్థానికులు, వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఆక్సిజన్ టవర్ ఎదురు రోడ్డులో వాహనాలు యూటర్న్ తీసుకుంటున్న సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కార్మిక వర్గాన్ని దెబ్బకొట్టే యత్నమే ప్రైవేటీకరణ



922వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలనే ఆలోచనతోనే ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చిందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. ఉక్కు ఉత్పత్తిని నిలిపివేసి, ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడమే కాక సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన దీక్షల్లో 922వ రోజు మంగళవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

'ప్రోగ్రెసివ్ ఫ్రంట్‌తోనే కార్మికులకు న్యాయం'

జోరుగా భెల్ గుర్తింపు యూనియన్ ఎన్నికల ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న ఇంటక్, సిటూ అలయన్స్ యూనియన్ వర్గాలు

అక్కిరెడ్డిపాలెం: భెల్ కార్మికుల హక్కులను సాధించాలంటే ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, వైఎస్సార్‌టీయూసీ, ఏఐటీయూసీ అలయన్స్‌గా పోటీ చేస్తున్న ప్రోగ్రెసివ్ ఫ్రంట్‌ను గెలిపించాలని అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న జి.టి.పి.ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా బరిలో నిలిచిన ఉరుకూటి బాబూరావు కోరారు. ఈ నెల 31న జరగనున్న భెల్ (హెచ్‌పీవీపీ) గుర్తింపు యూనియన్ ఎన్నికల సందర్భంగా మంగళవారం సంస్థ ప్రధాన గేటు వద్ద ఆయా యూనియన్ల నాయకులు, కార్మికులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ నాయకుడు ఎన్.నవీన్ కుమార్, రోమాల అప్పారావు, ఏఐటీయూసీ నాయకులు చిట్టిబాబు, ఎస్.వెంకట్రావు, సీతం నాయుడు, ఎస్.జగన్నాధరావు, కె.నారపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు అభినందన

దాబాగార్డెన్స్ : ఈ నెల 10 నుంచి 19 వరకు తిరుపతిలో నిర్వహించిన ఎన్‌సీసీ, సీఏటీసీ–వి (టీఎస్‌సీ–ఐజీసీ) క్యాంపు ముగించుకుని విశాఖ చేరిన క్యాడెట్లను విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ కె.గీతాంజలి, పి.సంతోషి, సీహెచ్ లక్ష్మి, పల్లవి, సీహెచ్ మల్లేశ్వరి, ఐ. తులసి, గాయత్రి పాల్గొన్నారు.